క్లుప్తంగా

హైస్కూల్‌ను సందర్శించిన జెడ్పీ చైర్‌పర్సన్


పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ విజయ

కవిటి: బొరివంక జెడ్పీ హైస్కూల్‌ను జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. బోధన జరుగుతున్న తీరును పరిశీలించారు. ప్రధానోపాధ్యాయులు సనపల రామకృష్ణతో మాట్లాడి పిల్లల ప్రతిభను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్నభోజన పథకం నిర్వహణ తీరుపై ఆరాతీశారు. పదో తరగతి విద్యార్థులకు సిలబస్ ఎంతమేరకు పూర్తి అయ్యిందో తెలుసుకున్నారు. స్థానిక సర్పంచ్ బెందాళం శ్రీరాంప్రసాద్ ఉన్నారు.

బారువను మండలంగా ఏర్పాటు చేయాలి


జెడ్పీ చైర్‌పర్సన్ విజయకు వినతిపత్రం అందజేస్తున్న బారువ గ్రామస్తులు

సోంపేట: మండలంలోని కొన్ని పంచాయతీలతోపాటు మేజర్ పంచాయతీ బారువను కలిపి నూతన మండలంగా బారువను ఏర్పాటు చేయడానికి కృషి చేయాలని మండల సాధన సమితి ప్రతినిధులు కోరారు. ఈ మేరకు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయను శుక్రవారం కలిసి కోరారు. బారువ గ్రామానికి చెందిన సర్పంచ్ యర్ర రజని, వైస్ ఎంపీపీ గురాల శ్రీను తదితరులు చైర్‌పర్సన్‌కు వినతి పత్రం అందజేశారు. తనవంతు కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు. చైర్‌పర్సన్ కలిసిన వారిలో బుజ్జి, ధర్మారావు, తిరుపతి, రాంబాబు, శంకర్, జోగారావు, వర్మ ఉన్నారు.

కవిటి: సోంపేట మండలం బారువను మండల కేంద్రం చేయాలని కోరుతూ ఎమ్మెల్సీ నర్తు రామారావును కొత్తపుట్టుగలోని నివాసంలో పలువురు కలిసి విజ్ఞప్తి చేశారు. శాసనమండలి ద్వారా ప్రభుత్వానికి నివేదిస్తానని ఎమ్మెల్సీ హామీ ఇచ్చారు.

10న కుమారన్న స్మారక సభ


వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

పలాస: శ్రీకాకుళం గిరిజన రైతాంగ సాయుధ పోరాట యోధుడు కామ్రేడ్ కుమారన్న స్మారక సభను లొత్తూరు పంచాయితీ పెదగంతారు గ్రామంలో సెప్టెంబర్ నెల పదో తేదీన నిర్వహిస్తున్నట్టు సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్ తెలిపారు. బొడ్డపాడు జిల్లా అమరవీరుల స్మారక మందిరం వద్ద శుక్రవారం కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్మారక సభకు ఉద్దానం ప్రాంతీయులతోపాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న పార్టీ శ్రేణులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో అరుణోదయ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్, న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వంకల మాధవరావు, పోతనపల్లి కుసుమ, గౌరకల బాలకృష్ణ, జుత్తు వీరాస్వామి పాల్గొన్నారు.

జాతీయస్థాయి యోగా పోటీలకు శ్రీకాంత్


శ్రీకాంత్ మహంతి

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం పట్టణానికి చెందిన శ్రీకాంత్ మహంతి జాతీయస్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 21 నుంచి 24వ తేదీ వరకు తాడేపల్లిగూడెంలో జరిగిన రాష్ట్రస్థాయి యోగాసన చాంపియన్ -2025 పోటీల్లో శ్రీకాంత్ మహంతి బంగారు పతకం సాధించడం ద్వారా జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని రాష్ట్ర యోగా కోచ్, స్పాన్సర్ ఎం.రామకృష్ణ శుక్రవారం తెలిపారు. ఈ నెల 30వ తేదీన నాగ్‌పూర్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు ఆంధ్రప్రదేశ్ నుంచి శ్రీకాంత్‌తో పాటు 30 మంది ప్రాతినిధ్యం వహిస్తున్నారన్నారు.


రంగులు వేయకుండా బెన్నుగానిపేట వద్ద పశువుల నీటి తొట్టె

ఇచ్ఛాపురం నియోజకవర్గంలో నీటి తొట్టెల వివరాలు ఇలా..

మండలం	తొట్టెలు నిర్మాణ లక్ష్యం	పూర్తయిన తొట్టెలు	నిర్మాణం పూర్తి కాని తొట్టెలు
ఇచ్ఛాపురం	21	16	05
కవిటి	23	19	04
కంచిలి	31	20	11
సోంపేట	23	12	11
పలాస	19	18	01
మందసా	41	29	12

- నిలిచిన నీటి తొట్టెల నిర్మాణం
- నిధుల విడుదల్లో జాప్యం
- ఆందోళనలో రైతులు

ఇవేం పనులు!

ఇచ్ఛాపురం రూరల్: అంతా ఆరంభ శూరత్వంగానే కూటమి ప్రభుత్వం చేపడుతున్న పనులు దర్శనమిస్తున్నాయి. మూగజీవులు దాహార్తి తీర్చేందుకు చేపట్టిన నీటి తొట్టెల నిర్మాణాల ప్రాజెక్టు ఆదిలోనే హంసపాదుగా మారింది. కూటమి ప్రభుత్వ పాలన ప్రగల్భాలు..ప్రకటనలకే పరిమితమైందని రుజువు చేసుకుంది. వేసవిలో మూగజీవుల దాహార్తిని తీర్చేందుకు నీటి తొట్టెల నిర్మాణ పనులను ఆర్భాటంగా ప్రారంభించింది. ఇందులో భాగంగా ప్రతి పంచాయతీకి రెండు నుంచి మూడు తొట్టెల నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేసింది. ఒక్కో తొట్టె నిర్మాణానికి రూ.32,200 ఉపాధి హామీ పథకం ద్వారా నిధులు కేటాయిస్తున్నట్టు ప్రకటించారు.

నిలిచిన పనులు

నీటితొట్టెల కోసం కేటాయించిన నిధులు విడుదల తీవ్రజాప్యం నెలకుంది. నాలుగు నెలలు కావస్తున్నా నిధులు విడుదల చేయకపోవడంతో చాలా ప్రాంతాల్లో నామమాత్రంగా నిర్మాణ పనులు చేపట్టి చేతులు దులుపుకున్నారు. ఒక్కో తొట్టె నిర్మాణానికి రూ.32,220 మంజూరవుతుందని, ఇందులో మెటీరియల్‌కు రూ.32,050 కేటాయిస్తుండగా, మిగిలిన రూ.170లను ఉపాధి కూలీలకు వేతనంగా ఇస్తున్నట్లు చెబుతున్నారు.

నీటి తొట్టెల నిర్మాణం పూర్తయినా ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు చాలా చోట్ల పనులు నిలిపివేశారు. నిధులు మంజూరు కాక, నీటి తొట్టెల నిర్మాణం జరగక, నిర్మాణం జరిగినవి వినియోగంలోకి తీసుకురాకపోవడంతో మూగజీవాలు దాహార్తితో అల్లాడుతున్నాయని పాడి రైతులు చెబుతున్నారు. నీటి తొట్టెలకు నీటి సరఫరా పనులు చేయించకపోవడంతో తొట్టెలు నిరుపయోగంగా మారాయి. బిల్లులు రాకపోవడంతో కొన్ని ప్రాంతాల్లో తొట్టెలకు సున్నాలు, రంగులు వేయలేదని కాంట్రాక్టర్లు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం మూగ జీవాలకు శాపంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


వడ్డిజట్లుపుట్టుగలో పొదలు మధ్య నిరుపయోగంగా నీటి తొట్టె

ఉన్నతాధికారుల దృష్టికి బిల్లుల సమస్య



పలాస క్లస్టర్ పరిధిలో 158 నీటి తొట్టెలు లక్ష్యం. వీటిలో 147 పనులు ప్రారంభించగా 114 పూర్తయ్యాయి. బిల్లుల సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లడం జరిగింది. బిల్లులు మంజూరైన వెంటనే కాంట్రాక్టర్లకు చెల్లించి మిగతా పనులు ప్రారంభిస్తాం. – చల్లా శ్రీనివాసరెడ్డి, ఏపీడీ, ఉపాధి హామీ పథకం, పలాసా క్లస్టర్

వేసవిలో పశువులకు ఇబ్బంది

నా దగ్గర 150 పశువులు ఉండగా, మా గ్రామంలో సుమారు వెయ్యికి పైగా ఉన్నాయి. వేసవిలో పశువులు దాహార్తికి అలమటించిపోతుంటాయి. ఇన్ని పశువులు ఉండే మా గ్రామంలో ఒక్క నీటి తొట్టె కూడా నిర్మించకపోవడం దురదృష్టకరం. బిల్లులు ఇవ్వకపోవడంతో చాలా ప్రాంతాల్లో నిర్మించిన తొట్టెల్లో నీరు వేయడం లేదని నాతోటి పాడి రైతులు చెబుతున్నారు.
– దట్టి జగ్గారావు, పాడి రైతు, ఈదుపురం, ఇచ్ఛాపురం మండలం

ఘనంగా క్రీడా దినోత్సవం

జాతీయ క్రీడా దినోత్సవాన్ని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు, పాఠశాలల్లో శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా హాకీ పితామహుడు మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు ఉపాధ్యాయులు, క్రీడాకారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. క్రీడారంగాభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ధ్యాన్‌చంద్‌ను ఆదర్శంగా తీసుకొని క్రీడల్లో రాణించాలన్నారు. ఈ సందర్భంగా వివిధ క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అలాగే విద్యార్థులు హాకీస్టిక్ ఆకారంలో కూర్చొని ఆకట్టుకున్నారు. క్రీడా ఉపాధ్యాయులను సత్కరించారు. – సాక్షి నెట్‌వర్క్


ఇచ్ఛాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థుల పిరమిడ్ విన్యాసాలు


కవిటి ప్రభుత్వ కళాశాలలో ధ్యాన్‌చంద్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ కె.సింహాచలంనాయుడు, సిబ్బంది


సంతబొమ్మాళి స్పోర్ట్స్ ఆకారంలో దండుగోపాలపురం విద్యార్థులు


పలాసలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు సన్మానం

నాయకుల పరామర్శ

ఇచ్ఛాపురం రూరల్: పీఏసీఎస్ చైర్మన్‌గా, సింహాచలం పుణ్యక్షేత్రం మండలి సభ్యునిగా సేవలందించిన తులసిగాం గ్రామానికి చెందిన పైలా రుక్మాంగధరరెడ్డి ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు అతని కుటుంబ సభ్యులను శుక్రవారం పరామర్శించి సంతాపం తెలియజేశారు. పరామర్శలో ఇచ్ఛాపురం, కంచిలి ఎంపీపీలు బోర పుష్ప, పైలా దేవదాసురెడ్డి, వైస్ ఎంపీపీ దువ్వు వివేకానందరెడ్డి, మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దక్కత నూకయ్యరెడ్డి, పలురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ఉన్నారు.

లంబోదరుడికి పూజలు

వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. మూడోరోజైన శుక్రవారం బొజ్జగణపయ్యకు భక్తులు విశేష పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందిలేకుండా కమిటీ సభ్యులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. రాత్రివేళ నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. – సాక్షి నెట్‌వర్క్


టెక్కలి రూరల్: అయ్యప్పనగర్‌లోని గణేష్ మండపం వద్ద దీపాల అలంకరణ


కంచిలి: మఠం కంచిలిలో ఏర్పాటు చేసిన 8 అడుగుల వినాయకుని విగ్రహం


ఇచ్ఛాపురం రూరల్ పోలీస్ స్టేషన్‌లో గణపతికి పూజలు చేస్తున్న ఎస్ఐ శ్రీనివాస్, సిబ్బంది


వజ్రపుకొత్తూరు: హరిదాసుపురంలో కొలువైన గణనాథుడు


కవిటి: బొరివంకలో కదంబ గణపతిని దర్శించుకుంటున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ


వజ్రపుకొత్తూరు రూరల్: నీలాపురం గ్రామంలో కేధారనాథ్ ఆలయ ఆకృతిలో మండపం


కాశీబుగ్గలో గొరిల్లా ఆకృతిలో ఏర్పాటు చేసిన మండపం

తెలుగు భాష అమ్మవంటిది

తెలుగు భాష అమ్మవంటిదని వక్తలు అన్నారు. తెలుగుభాషా దినోత్సవాన్ని పాఠశాలలు, కళాశాలల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తెలుగు భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలుగు భాషాభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. మాతృ భాషను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు 'తెలుగు' అక్షర క్రమంలో కూర్చొని అలరించారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. – సాక్షి నెట్‌వర్క్


కవిటి ప్రభుత్వ పాఠశాలలో గిడుగు రామ్మూర్తి విగ్రహానికి నివాళులర్పిస్తున్న అర్పిస్తున్న చిన్నారులు, సిబ్బంది


ఇచ్ఛాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో సిబ్బంది


వజ్రపుకొత్తూరు రూరల్: నగరంపల్లి జెడ్పీహెచ్ స్కూల్‌లో ఉపాధ్యాయులకు సత్కారం


మందస: సన్మాన గ్రహీతలతో కొత్తత్తపల్లి పాఠశాల సిబ్బంది


కంచిలి: మకరాంపురం పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవ వేడుకలు


ఇచ్ఛాపురం రూరల్: దొంకూరు హైస్కూల్‌లో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న దృశ్యం


వజ్రపుకొత్తూరు: హుకుంపేట ఎంపీపీ పాఠశాలలో 'అ 'ఆకారంలో విద్యార్థులు


సోంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గిడుగు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిబ్బంది, విద్యార్థులు


పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలవేస్తున్న సిబ్బంది


సంతబొమ్మాళి: అఆ ఆకృతిలో దండుగోపాలపురం విద్యార్థులు

రోడ్లను ఆక్రమిస్తుంటే చర్యలేవి?

పలాస: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో రోడ్లను ఆక్రమించుకొని నిర్మాణాలు చేపడుతుంటే ఏమి చర్యలు తీసుకుంటున్నారని మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు బమ్మిడి సంతోష్‌కుమార్ ప్రశ్నించారు. శుక్రవారం జరిగిన మున్సిపల్ సమావేశం అనంతరం కమిషనర్ ఎన్.రామారావుతో రోడ్ల ఆక్రమణలపై ప్రత్యేకంగా మాట్లాడారు. పద్మనాభంపురం వద్ద వ్యవసాయ మార్కెట్ పక్కన ఓ కౌన్సిలర్ రోడ్డును ఆక్రమించుకొని ప్రహరీ కడుతుంటే చర్యలు తీసుకోరా అని కమిషనర్‌ను అడిగారు. దీనికి కమిషనర్ సమాధానం చెబుతూ పరిశీలించామని.. తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే కౌన్సిల్ ఆమోదం కూడా ఉందన్నారు. ఈ అంశంపై పలు ఫిర్యాదులు అందాయని చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని కమిషనర్ స్పష్టం చేశారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్టు చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సమావేశానికి 23 వార్డుల కౌన్సిలర్లతో పాటు కోఆప్షన్ సభ్యులు హాజరు కావాలని సూచించారు.

కూటమి పాలనలో అన్నదాతకు కష్టాలు

- ఎమ్మెల్సీ రామారావు


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామారావు

ఇచ్ఛాపురం రూరల్: ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో రైతులు ఎప్పుడూ విత్తనాలు, ఎరువుల కోసం అవస్థలు పడుతూనే ఉంటున్నారని.. ప్రస్తుతం కూడా అదే పరిస్థితి నెలకుందని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. స్థానిక ఎంపీపీ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. యూరియా కోసం రైతులు రోడ్డెక్కి ఆందోళనలు చేస్తున్నా కూటమి ప్రభుత్వం మొద్దునిద్ర వీడటం లేదని మండిపడ్డారు. గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో విత్తనాలు, ఎరువుల కోసం రైతులు ఎదురు చూడలేదన్నారు. రైతులకు కావాల్సినవన్నీ ఆర్‌బీకేల ద్వారా అందించారని గుర్తు చేశారు. సూపర్ సిక్స్ అమలు చేశామని కూటమి ప్రభుత్వం చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. సమావేశంలో ఎంపీపీ బోర పుష్ప, మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు, జెట్పీటీసీ మాజీ సభ్యుడు దక్కత నూకయ్యరెడ్డి, సర్పంచ్‌లు కారంగి త్రినాథ్, సంతోష్ మండలా, ఆశి కృష్ణారెడ్డి, వైసీపీ జిల్లా ఆర్గనైజింగ్ కమిటీ సభ్యుడు ఆశి పురుషోత్తమరెడ్డి, ఇసురు యాదవరెడ్డి పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన



సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వజ్రపుకొత్తూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రిచార్డ్ బూన్ అన్నారు. చినవంకలో శుక్రవారం ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 50 మందికి వైద్య పరీక్షలు చేసి మందులను అందజేశారు. ఆరోగ్యానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వైద్య ఆరోగ్య సిబ్బంది పి.రూపులక్ష్మి, ఎస్.చంద్రధర్, టి.లక్ష్మీదేవి, సీహెచ్ సోమేశ్వరరావు, సంధ్య, ఎస్.జ్యోతి, ఎస్.రమణ, సీతాలక్ష్మి, కె.ధనలక్ష్మి ఉన్నారు. – వజ్రపుకొత్తూరు రూరల్

శిక్షణ శిబిరం

సాంకేతిక విద్యనభ్యసిస్తున్న విద్యార్థులంతా సమాజానికి మేలు కలిగించే విధంగా సరికొత్త పరిశోధనలపై దృష్టి సారించాలని టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు సూచించారు. కళాశాలలో రీసెర్చ్ కాన్‌క్లేవ్ శిక్షణ శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. నూతన పరిశోధనల్లో భాగంగా అభివృద్ధి, కోడింగ్ విధానంలో మార్పులు, కొత్త అప్లికేషన్లపై దృష్టి సారించాలని సూచించారు. నూతన పరిశోధనల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేస్తామని వెల్లడించారు. ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డీన్ బట్టాచార్య, శ్రీరాములు పాల్గొన్నారు. – టెక్కలి



బహుమతుల ప్రదానం



జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన వివిధ క్రీడల్లో విజేతలైన విద్యార్థులకు శుక్రవారం బహుమతులు అందజేశారు. ముందుగా ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ ఆధ్వర్యంలో హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు. – టెక్కలి

జిల్లా స్థాయి రన్నింగ్ పోటీలో క్రీడాకారుల ప్రతిభ


బహుమతులు పొందిన బాలికలతో కమిటీ ప్రతినిధులు

వజ్రపుకొత్తూరు రూరల్: కొండపల్లి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన జిల్లాస్థాయి మూడు కిలో మీటర్ల రన్నింగ్ పోటీలలో పలువురు ప్రతిభ కనబర్చారు. బాలుర విభాగంలో మందస మండలానికి చెందిన ఏ.శ్యాం ప్రథమ, నందిగాం మండలానికి చెందిన బి.మహేష్ ద్వితీయ, వజ్రపుకొత్తూరు మండలానికి చెందిన సీహెచ్ బాలకృష్ణ తృతీయ స్థానంలో నిలిచారు. అలాగే బాలికల విభాగంలో నవర మల్లికా ప్రథమ, నందిని సాహు ద్వితీయ స్థానంలో నిలిచారు. ప్రతిభ కనబర్చిన వారికి నగదుతో పాటు జ్ఞాపికలను అందజేశారు. ఒజీడి రైతు సంఘ కన్వీనర్ తెప్పల అజయ్‌కుమార్, క్రాంతి యువజన సంఘ అధ్యక్షుడు వై.కామేశ్వరరావు, దాత యంపల్ల మధు, పుక్కళ్ల ప్రభాకర్ ఉన్నారు.